కథ

# పెట్టేదానికి మొగుడొస్తే...



రెండు మూడు నెలలుగా పట్టి పీడించిన వేసవి వెనుక వచ్చిన మృగశిర జల్లులకు జీవం పోసుకుని ఉత్సాహంతో ఊగిపోతున్నాయి తోటలోని పూలమొక్కలు. కొత్తగా చిగురు తొడిగిన ఆ మొక్కలు అరవై రోజుల సమ్మె పిదప మొన్ననే పనిలో చేరిన కార్మికుల మొహాలని గుర్తు చేశాయి.

అవును...మొన్ననే పనిలో చేరాము...సమ్మె విరమించుకుని. సమ్మె మొదలైనప్పటినుంచి రాజు నాకు కనిపించలేదు. అతన్ని కలవకుండా ఉండడం నాకు కష్టంగా ఉండేది. ఎందుకంటే రాజుని సంప్రదించనిదే నేను ఏ పనీ చెయ్యలేను. అది నా బలహీనత.

ఆ బలహీనత ఈనాడు పుట్టుకొచ్చినది కాదు. తప్పటడుగులు వేసిన రోజులనుంచీ నాలో పుట్టి, పెరిగిన బలహీనత అది!

నా బలహీనతని కర్మాగారంలో కొందరు ఎగతాళి చేసేవారు; మరికొందరైతే నా మొహంమీదే అసంతృప్తి వ్యక్తం చేసేవారు.

"ఇలా ఉంటే లాభం లేదండీ." వాళ్లు అనేవారు. "మీరు రాజుతో సన్నిహితంగా ఉండడం మా కిష్టం లేదు. ప్రతిదానికీ అతన్ని సంప్రదించే పద్ధతి మార్చుకోకపోతే మేము మా నాయకుడిని మార్చుకోవలసి వస్తుంది."

వాళ్ల ఉద్దేశం నా కర్థమైంది. కార్మిక నాయకుడిగా నేను రాజుతో సన్నిహితంగా ఉండడం వాళ్ల కిష్టం లేదు. "రాజు మనకన్నా ఎంతో తెలివి కలవాడు. మంచి సలహా లిస్తాడు. పైగా నా చిన్ననాటి స్నేహితుడు."

ఎల్. ఆర్. స్వామి

చినుకులు పడుతున్నా పట్టించుకోకుండా గబగబా నడిచాను. ఫాక్టరీ గేటు దాటుతున్నాడు రాజు. వాడిని కలవాలి.

రాజుని కలవడానికి గత రెండు మూడు రోజులుగా ప్రయత్నిస్తూనే ఉన్నానుకాని, కుదరలేదు.

"కావచ్చు...అయినా, అతనితో కలవడం మా కిష్టం లేదు."

"ఎందుకనీ?"

"అతను మన వర్గానికి చెందినవాడు కాదు. అతను ఇంజనీర్."

"ఓ అదా మీ అభ్యంతరం?" నాకు నవ్వు ఆగలేదు. "ఇంజనీర్ అయితే ఏమిటి...అతనుకూడా మన సహోద్యోగే కదా?"



"విభజించి పాలించే యాజమాన్యంవారు తెలివిగలవారు కలవకుండా ఉండడానికి ఏవో అడ్డుగోడలు కడతారులే."

"అయినా, అతని మద్దతు మనకుంటే మంచిదేగా?"

వాళ్లను నేను తృప్తి పరచానో, లేదో తెలియలేదు. కాని, నేనుమాత్రం రాజుతో ప్రతీ విషయమూ చర్చించే అలవాటు మానుకోలేదు. సమ్మె చేయడం గురించికూడా చర్చించాను.

"గట్టి పట్టుబడితే ఇస్తారురా." రాజు అన్నాడు. "ఆఫ్టరాల్...మీరు అడుగుతున్నది స్కూటర్ లోనేకదా?"

"నాకూ అలాగే అనిపిస్తోందిరా." నేను ఆలోచిస్తూ అన్నాను. "కాని, స్కూటర్ లోనే కాదు; మిగతా విషయాల్లో కూడా యాజమాన్యం ఒప్పందం కుదుర్చుకునేలా లేదు...సమ్మె తప్పదులా ఉందిరా."

"తప్పదంటే చెయ్యండి మరి!"

"అలా అంటే చాలదురా...మాకు నీ మద్దతు కావాలి."

"ఓ...అదేం భాగ్యం?" రాజు తేలికగా నవ్వుతూ అన్నాడు. "గుర్తున్న రోజులనుంచీ నీకు మద్దతు ఇస్తూనే ఉన్నాను."

"నిజమేకాని, అది వేరు, ఇది వేరు."

"మా వాళ్లకు కూడా ఆ మాట చెప్తానులే. నీ పని నువ్వు చెయ్యి."

❄ ❄ ❄

సమ్మె మొదలైందికాని, కర్మాగారంలోని యంత్రాలు ఆగలేదు. ప్రపంచ యాజమాన్యానికి ప్రతినిధులైన సూర్యచంద్రులు ఎవరి డ్యూటీ వారు చేసుకుని వెళ్లిపోయారు. రాజుతోసహా ఇంజనీర్లందరూ రోజుకి పదహారు గంటలు పనిచేశారు.

అరవై రోజులు గడిచిపోయాయి. ఎదురుగా ఉన్న ప్రేక్షకుల ప్రోత్సాహంతో విజృంభించి, గట్టిగా అరచి స్వతంత్రుడు అయిపోతాడనే అపోహతో గోల చేసినా చివరకు చతురుడైన రింగ్ మాస్టరుకు లొంగిపోయి బోనులోకి వెళ్లడం తప్పని సర్కస్ పులిలా సమ్మె విరమించుకుని పనిలో చేరడం తప్పలేదు మాకు. ఏ ఒప్పందమూ కుదుర్చుకోకుండానే రెండు రోజుల క్రితం డ్యూటీలో చేరిపోయాము.

అప్పటినుంచీ రాజుని కలవాలని ప్రయత్నిస్తూనే ఉన్నాను. ఇప్పుడు దొరికాడు. వెనకనుంచి వెళ్లి రాజు భుజంమీద చెయ్యి వేశాను. ఉలిక్కిపడ్డాడు. నన్ను చూసి కంగారుపడినట్లు ఉన్నాడు. ఇబ్బందిగా తప్ప దన్నట్లు నవ్వాడు.



"అప్పుడె వెళ్లిపోతున్నా వేమిటిరా?" నేనే ముందు మాట్లాడాను. "ఏమైందిరా?"

రాజు నా మొహం చూడలేకపోయాడు. ఏదో తప్పు చేసినవాడిలాగా నేలచూపులు చూస్తూ నిలబడ్డాడు.

"రెండు రోజులనుంచీ చూస్తున్నానురా నీ గురించి!"

"సారీ రా...సమ్మెలో నీకు మద్దతు నివ్వలేక పోయాను. ఏమైందసలు...?"

"అవన్నీ ఇప్పు డెందుకురా?" దూరంగా కదిలిపోతున్న మబ్బులని చూస్తూ అన్నాను నేను. "యాజమాన్యంతో ఇంకా ఒప్పందం కుదరలేదు."

"ఒప్పందం అయిపోతుందిలే...మీ రడిగిన స్కూటరు లోనూ, వగైరాలు ఇచ్చేస్తారులే."

"ఇస్తే మాకు అంతకన్నా ఏంకావాలి?" నేను నిట్టూరుస్తూ అన్నాను.

"ఇన్ని రోజులు సమ్మె చేసినందుకు అవన్నా వస్తే..."

"ఏమిటి ఇక్కడ నిలబడిపోయావ్?" రాజు స్నేహితుడు మరో ఇంజనీర్ గేటుదాటుతూ అడిగాడు. "ఈ రోజు నువ్వు స్కూటర్ తీసుకోవా?"

"స్కూటర్ ఏమిటి?" నేను ఆశ్చర్యంతో ఉండిపోయాను."సమ్మెలో ఓవర్ టైమ్ చేసి అంత డబ్బు సంపాదించా వన్నమాట."

"ఓవర్ టైమ్ కాదు...ఇంజనీర్లకి స్కూటర్ కొనుక్కోవడానికి వడ్డీ లేని అప్పు ఇచ్చారు. మీకూ ఇస్తారులే."

నా గుండె ఆగిపోయింది. రాజు మమ్మల్ని సమ్మె చెయ్యడానికి ఎందుకు ప్రోత్సహించాడో అప్పుడు అర్థమైంది. ఏడ్చేదానికి మొగుడొస్తే, ఏడ్వనిదానికి ఎలాగూ వస్తాడని మమ్మల్ని గిల్లి వదిలేశా డన్నమాట! ■

## మహాయాత్ర

'తరంగిణి' అనే పేరున్న ఈ నౌక భారతీయనావికాదళానికి చెందినది. నౌకాదళానికి అడ్మిరల్ అయిన మాధవేంద్రసింహ్ దీన్ని ఈ జనవరి 23న విశ్వభ్రమణానికి సన్నద్ధం చేశారు. పద్నాలుగు నెలల ఈ ప్రయాణంలో తరంగిణి, 17 దేశాలు, 37 హార్బర్లనూ, 33 వేల మైళ్ల సముద్రతీరాలనూ చూసి తిరిగొస్తుంది.

ఎన్.

## మొటిమలకు చికిత్స

యుఎస్‌లో మొటిమలకు ఓ కొత్త రకం థెరపీని కనుక్కున్నారు. దీని పేరు 'క్లియర్ లైట్ థెరపీ'. ముఖం మీదికి ఒక రకం లైట్‌ను ఫోకస్ చేస్తారు. దాని తాలూకు కిరణాలు ప్రసరించిన చోట మొటిమలు కొన్ని నెలల దాకా రావు. ఒకే ఒక్కసారి తీసుకునే ట్రీట్‌మెంట్‌తో చర్మం మీద, మొటిమలను వ్యాపింపజేసే బాక్టీరియా దాదాపు 70 శాతం నశించిపోతుంది. మొటిమలకు మామూలుగా చేసుకునే మరో చికిత్స కూడా వుంది. గుడ్డు సొనను మొటిమల మీద రాసి రాత్రంతా అలాగే వదిలేయాలి. గుడ్డులో చురల్ రెటినో ఏ అనే సహజమైన విటమిన్ వుంటుంది. దానితో మొటిమలు కొంత వరకూ పోతాయి.

ఎన్.